సాక్షి
నల్లగొండ
గురువారం ; 21 ; మార్చి ; 2024



చేనేత రంగం కీలకం

చేనేత రంగం కీలకమని న్యూఢిల్లీ నేషనల్ డిఫెన్స్ అకాడమీ మేజర్ జర్నల్ అజయ్ కుమార్ సింగ్ పేర్కొన్నారు. - 8లో



సామాజిక న్యాయం పాటించాలి

పార్లమెంట్ ఎన్నికల్లో అన్ని పార్టీలు సామాజిక న్యాయం పాటించాలని జాజుల శ్రీనివాస్‌గౌడ్ కోరారు. - 8లో

రంజాన్ వేళలు

ఇఫ్తార్ 6-33 (గురువారం సా॥)
సహర్ 4-57 (శుక్రవారం ఉ॥)

న్యూస్‌రీల్

ఎంసీఎంసీ అనుమతి తప్పనిసరి



మీడియా సెంటర్‌ను పరిశీలిస్తున్న రాజ్యలక్ష్మి

నల్లగొండ : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మీడియాలో ప్రసారమయ్యే రాజకీయ ప్రకటనలకు తప్పనిసరిగా మీడియా సర్టిఫికేషన్ – మానిటరింగ్ కమిటీ (ఎంసీఎంసీ) అనుమతి తీసుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్‌ఓ) రాజ్యలక్ష్మి పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన మీడియా సెంటర్‌ను ఆమె ప్రారంభించి మాట్లాడారు. మీడియాలో ప్రచురితమైన ప్రకటనలు, పెయిడ్ న్యూస్‌ను ఎంసీఎంసీ పరిశీలిస్తుందన్నారు. మీడియా సెంటర్ ద్వారా ఎన్నికల సమాచారాన్ని ఎప్పటికప్పుడు మీడియా ప్రతినిధులకు తెలియజేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంసీఎంసీ మెంబర్ సెక్రటరీ, డీపీఆర్‌ఓ వెంకటేశ్వర్లు, మీడియా రిలేషన్స్ నోడల్ అధికారి, జిల్లా పరిశ్రమల శాఖ మేనేజర్ కోటేశ్వరరావు, ఎంసీఎంసీ సభ్యులు, జిల్లా ఇన్ఫర్మేటిక్ అధికారి గణపతిరావు, రాజ్‌కుమార్, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

28న బార్ అసోసియేషన్ ఎన్నికలు

మిర్యాలగూడ టౌన్ : మిర్యాలగూడ బార్ అసోసియేషన్ ఎన్నికలు ఈనెల 28న నిర్వహించనున్నట్లు ఎన్నికల అధికారులు ఏచూరి శ్రీనివాస్, రెడ్డిపల్లి సైదులు తెలిపారు. తెలంగాణ బార్ కౌన్సిల్ ఆదేశాల మేరకు షెడ్యూల్‌ను విడుదల చేశారు. ఈ నెల 21, 22 తేదీల్లో నామినేషన్లు దాఖలు, 23న నామినేషన్ల ఉపసంహరణ, 28న ఎన్నికలు, సాయంత్రం కౌంటింగ్‌తో పాటు ఫలితాలు ప్రకటిస్తామని తెలిపారు.

భువనగిరి సీపీఎం అభ్యర్థిగా జహంగీర్



భువనగిరిటౌన్ : భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గం సీపీఎం అభ్యర్థిగా ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్‌ను రాష్ట్ర కమిటీ బుధవారం ప్రకటించింది. ఆయన స్వగ్రామం రామన్నపేట మండలం మునిపంపుల. మహబూబ్ అలీ, బీజన్‌బీ దంపతులకు 1970లో జన్మించారు. పోస్టు గ్రాడ్యుయేషన్ చేసిన జహంగీర్.. ఎస్‌ఎఫ్‌ఐ, డీవైఎఫ్‌ఐ, ఇతర ప్రజాసంఘాల్లో వివిధ హోదాల్లో పని చేశారు. ప్రస్తుతం జిల్లా కార్యదర్శిగా ఉన్నారు. వామపక్ష భావజాలంతో ఎన్నో ఉద్యమాల్లో పాల్గొన్నారు. తండ్రి మహబూబ్ అలీ కూడా వామపక్షవాది. వామపక్ష ఉద్యమాల్లో చురుకైన పాత్ర పోషించారు. మునిపంపుల గ్రామ సర్పంచ్‌గా పని చేశారు.

ఆంథోల్‌మైసమ్మ ఆలయ హుండీ లెక్కింపు



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది

చౌటుప్పల్ : మండల పరిధిలోని దండుమల్కాపురంలో గల శ్రీఅంథోల్‌మైసమ్మ లాలయ హుండీని బుధవారం ఉమ్మడి నల్లగొండ జిల్లా దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ మహేందర్‌కుమార్ సమక్షంలో లెక్కించారు. 43 రోజులకు గాను 4,26,275 ఆదాయం సమకూరిందని ఆలయ ఈఓ మోహన్‌బాబు తెలిపారు.

గ్రంథాలయాలను వినియోగించుకోవాలి



కూరెళ్లను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

చిట్యాల: గ్రంథాలయాలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకుని విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని పద్మశ్రీ కూరెళ్ల విఠలాచార్య అన్నారు. రామన్నపేట మండలం వెల్లంకి గ్రామీణ గ్రంథాలయాన్ని బుధవారం చిట్యాల మండలం గుండ్రాంపల్లి జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులు క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా సందర్శించారు. ఈ సందర్భంగా విఠలాచార్య మాట్లాడుతూ విద్యార్థులు నిరంతరం చదవడం ద్వారానే అనుకున్న లక్ష్యాలను చేరుకోవచ్చన్నారు. అనంతరం విఠలాచార్యను ప్రధానోపాధ్యాయుడు కొండకింది అంజిరెడ్డి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా సన్మానించారు.

చిన్నారికి ఊపిరి!



జీజీహెచ్‌లో కంగారు మదర్ కేర్ సేవలు

- 2012లో యూనిట్ ఏర్పాటు
- ఇప్పటి వరకు 3,537 మందికి వైద్య సేవలు
- నెలలు నిండని, బరువు తక్కువగా పుట్టిన చిన్నారులకు వైద్యం
- కంగారు మాదిరిగా తల్లి సంరక్షణ ఉండేలా చికిత్స

నల్లగొండ టౌన్: జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రిలోని కంగారు మదర్ కేర్ యూనిట్(కేఎంసీ) వేలాది మంది చిన్నారులకు ఊపిరిపోస్తోంది. ఆస్పత్రిలోని ఎస్‌ఎన్‌సీయూకు అనుబంధంగా 2012 సంవత్సరంలో కంగారు మదర్ యూనిట్ ఏర్పాటు చేశారు. నెలలు నిండకుండా, ఉమ్మనీరు పోయి బరువు తక్కువగా పుట్టిన చిన్నారులకు కేఎంసీలో ప్రత్యేక చికిత్స అందిస్తున్నారు. తొలుత ప్లాస్టిక్ కుర్చీలతో ఏర్పాటు చేసిన ఈ యూనిట్‌ను ఆ తరువాత బెంచీలు, అనంతరం రూ.10 లక్షలతో ఆదునికీకరించి ప్రస్తుతం పది బెడ్‌లతో కొనసాగిస్తున్నారు.

కేఎంసీ అంటే..

కంగారు మదర్ కేర్ (కేఎంసీ) అంటే కంగారు జంతువు తన పిల్లలకు కడుపుకింద ఉన్న సంచిలో ఉంచుకుని తీసుకెళ్తుంటుంది. ఆ మాదిరిగానే బరువు తక్కువగా పుట్టిన చిన్నారులను (రెండు కిలోలలోపు పుట్టిన) కేఎంసీలో జాయిన్ చేసుకుంటారు. అందులో తల్లితో పాటు చిన్నారిని ఉంచి చికిత్స అందిస్తారు. చిన్నారికి ఆకలివేసినప్పుడు వెంటనే తల్లిపాలు పట్టించడంతో పాటు శిశువును తల్లి ఎదపై బోర్లా పడుకోబెట్టిస్తారు. దీని ద్వారా చిన్నారికి అవసరమైన వెచ్చదనాన్ని తల్లినుంచి పొందడంతో పాటు తల్లీబిడ్డ అనుబంధం పెనవేసుకుంటుంది. ఆకలివేసిన వెంటనే పాలు పట్టించడం ద్వారా చిన్నారి ఎదుగుదల బాగా ఉంటుంది. చిన్నారులకు ఉన్న చిన్నచిన్న సమస్యలను తల్లి తెలుసుకునే అవకాశం ఉంటుంది. అంటువ్యాధుల బారిన పడరు. తక్కువ సమయంలో చిన్నారులు కోలుకుంటారు. కేఎంసీలో సిబ్బంది కూడా అంతగా అవసరం లేదు. అవసరమైన చిన్నారికి ఆక్సిజన్, మందులు అందించడానికి ఒకరిద్దరు సిస్టర్స్ ఉంటే సరిపోతుందని వైద్యులు పేర్కొంటున్నారు.

ఇప్పటి వరకు అందించిన చికిత్సలు ఇలా...

సంవత్సరం	చేరినవారు	బాగైనవారు	వేరే ఆస్పత్రులకు పంపినవారు	మరణాలు
2012	160	137	10	13
2013	250	22	21	9
2014	300	270	24	6
2015	285	207	23	55
2016	287	229	25	33
2017	324	223	41	60
2018	290	220	33	37
2019	327	259	44	24
2020	365	315	31	19
2021	297	238	34	25
2022	319	270	29	20
2023	333	273	12	48



కేఎంసీలో చికిత్స పొందుతున్న మాతా శిశువులు

త్వరగా బరువు పెరిగే అవకాశం



కేఎంసీ యూనిట్‌లో చిన్నారులకు కంగారు మదర్ కేర్ పద్ధతిలో చికిత్స అందించడంతో చిన్నారికి ఆకలి వేసిన వెంటనే పాలు పట్టిస్తారు. దీనివల్ల చిన్నారులు త్వరగా కొలుకుని బరువు పెరిగే అవకాశం ఉంటుంది. తల్లిపాలు ఎక్కువ పట్టించడం వల్ల రోగ నిరోధక శక్తి పెరిగి ఆరోగ్యంగా తయారుఅవుతారు. ఈ విధానం వల్ల తల్లికి.. బిడ్డ సమస్యలు కూడా తెలిసి వారి ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకునే అవకాశం ఉంటుంది.

డాక్టర్ దామెర యాదయ్య, కేఎంసీ ఇన్‌చార్జి

పాప ఆరోగ్యంగా ఉంది



ఓ ఫంక్షన్ నిమిత్తం నల్లగొండకు వచ్చాను. నెలలు నిండకుండానే నొప్పులు రావడంతో ఆసుపత్రిలో చేరాను. కిలో 900 గ్రాముల బరువుతో పాప పుట్టింది. మమ్ముల్ని కేఎంసీలో చేర్చుకుని చికిత్స చేశారు. ప్రస్తుతం పాప బరువు పెరిగి సంపూర్ణ ఆరోగ్యంగా ఉంది.

– నాగరాణి, హైదరాబాద్

త్వరగా కోలుకున్నాడు



ఉమ్మనీరు పోయి తమ బాబు కిలోన్నర బరువుతో పుట్టాడు. మిర్యాలగూడ ఏరియా ఆసుపత్రికి పోతే కేఎంసీకి పంపించారు. ఇక్కడి డాక్టర్లు కేఎంసీలో ఉంచి చికిత్స చేశారు. 24 గంటలు బాబుతో కలిసి ఉండి పాలు పట్టించడంతో పాటు కంగారు పద్ధతిలో ఎదపై పడుకోబెట్టుకోవడం వల్ల త్వరగా కోలుకున్నాడు. ఇక్కడి డాక్టర్లు, సిబ్బంది బాగా చూసుకున్నారు.

– అనిత, మిర్యాలగూడ

మద్దతు ధర ఇవ్వకుంటే మిల్లులు సీజ్

- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



రైతులతో మాట్లాడుతున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

మిర్యాలగూడ: రైతులు పండించిన ధాన్యానికి మద్దతు ధర చెల్లించని మిల్లులను సీజ్ చేస్తామని రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి హెచ్చరించారు. బుధవారం ఆయన మిర్యాలగూడలో ఓ ప్రైవేట్ కార్యక్రమానికి హాజరై తిరిగి నల్లగొండకు వస్తుండగా.. వేములపల్లి మండలం శెట్టిపాలెం శివారులోని ఓ రైస్ మిల్లు వద్ద భారీగా చేరిన ధాన్యం ట్రాక్టర్లను చూశారు. వెంటనే తన కాన్వాయ్‌ను ఆపి రైతులతో మాట్లాడారు. మిర్యాలగూడలో రైస్ మిల్లుల యజమానులు సిండికేట్‌గా మారి తక్కువ ధరకే ధాన్యం కొనుగోలు చేస్తున్నారని రైతులు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. దీనికి స్పందించిన మంత్రి.. జిల్లా పౌరసరఫరాల అధికారి వెంకటేశ్వర్లుకు, అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌కు ఫోన్ చేసి రైతులకు వెంటనే గిట్టుబాటు ధర కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రైతుల వద్ద నుంచి మద్దతు ధర కంటే తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్న మిల్లర్లపై చర్యలు తీసుకోవాలని, ఆ మిల్లులను వెంటనే సీజ్ చేయాలని ఆదేశాలు జారీచేశారు.

ఇంటి నుంచే ఓటు



- వృద్ధులు, దివ్యాంగులకు అవకాశం
- ఏప్రిల్ 22వ తేదీ వరకు దరఖాస్తుల స్వీకరణ

నల్లగొండ : వృద్ధులు, దివ్యాంగులకు ఎన్నికల సంఘం ఇంటి వద్ద నుంచే ఓటు హక్కును వినియోగించుకునేందుకు అవకాశం కల్పించింది. 85 సంవత్సరాలు పైబడినవారు, దివ్యాంగులు.. ఎవరైతే పోలింగ్ బూత్‌కు వచ్చి ఓటు వేసేందుకు అవకాశం లేదో వారు తమ ఇంటి వద్ద నుంచే ఓటు హక్కును వినియోగించుకునే వెసులుబాటు ఉంది. అందు కోసం ఏప్రిల్ 22వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని ఎన్నికల సంఘం సూచిస్తోంది. వారి దరఖాస్తులను పరిశీలించి అన్నీ సవ్యంగా ఉంటే వారు తమ ఇంటి వద్ద నుంచే ఓటు వేసే అవకాశం కల్పిస్తామని పేర్కొంది.

బీఎల్‌ఓ, తహసీల్దార్ కార్యాలయాల్లో..

నల్లగొండ పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజక వర్గాల్లో 85 ఏళ్లు పైబడిన ఓటర్లు 11,883 మంది ఉండగా.. దివ్యాంగులు 46,406 మంది ఉన్నారు. వారి నుంచి ఎన్నికల అధికారులు దరఖాస్తులు స్వీకరిస్తారు. తహసీల్దార్ కార్యాలయాలు, బీఎల్‌ఓల వద్ద దరఖాస్తులను సిద్ధంగా ఉంచారు. ఆధార్, ఎపిక్ కార్డు నంబర్లతో దరఖాస్తును బీఎల్‌ఓలకు లేదా తహసీల్దార్ కార్యాలయంలో ఎన్నికల అధికారులకు ఇవ్వాల్సి ఉంటుంది. ఆ దరఖాస్తు ఆధారంగా సదరు వ్యక్తి ఇంటి వద్ద నుంచి ఓటు వేసేందుకు అర్హుడా కదా అనే విషయాన్ని పరిశీలిస్తారు. అర్హత ఉంటే అతడికి ఇంటి వద్ద నుంచే ఓటు వేసే అవకాశం కల్పిస్తారు.

హోం ఓటింగ్ ఇలా..

పోలింగ్‌కు ముందుగానే దరఖాస్తుదారుల ఇళ్లకు రెవెన్యూ, పోలింగ్, పోలీస్ సిబ్బంది వెళ్లి ఇంటి వద్దనే వారు ఓటు వేసే విధంగా అవకాశం కల్పిస్తారు. బ్యాలెట్ పేపర్‌తో పాటు పోలింగ్ బాక్సును వెంట తీసుకెళ్లి అక్కడ సదరు వ్యక్తి ఓటు వేసిన తర్వాత బ్యాలెట్ బాక్సును అతని ముందుంచుతారు. బ్యాలెట్ పేపర్‌ను ఆ బాక్స్‌లో ఓటరే స్వయంగా వేస్తారు. సిబ్బంది ఆ బాక్స్‌ను ఆర్‌ఓ కార్యాలయంలో భద్రపరుస్తారు. కౌంటింగ్ రోజున ఆ బాక్స్ తెరుస్తారు.

సమర్థంగా విధులు నిర్వహించాలి

- కలెక్టర్ హరిచందన



దేవరకొండలో డీఆర్‌సీ సెంటర్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ హరిచందన

దేవరకొండ : ఎన్నికల విధులను అధికారులు సమర్థవంతంగా నిర్వహించాలని కలెక్టర్ దాసరి హరిచందన పేర్కొన్నారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో దేవరకొండ పట్టణంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేయనున్న డీఆర్‌సీ సెంటర్‌ను అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌తో కలిసి ఆమె పరిశీలించారు. డీఆర్‌సీలో స్ట్రాంగ్ రూం వద్ద పటిష్ట భద్రత ఏర్పాటు చేయాలని పోలీస్ అధికారులకు ఆమె సూచించారు. ఈవీఎంల భద్రత, పోలింగ్ కేంద్రాలకు ఈవీఎంలు తరలించే బస్సులు, సీసీ కెమెరాల ఏర్పాటు వంటి అంశాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. వారి వెంట దేవరకొండ ఆర్డీఓ శ్రీరాములు, డీఎస్పీ గిరిబాబు, తహసీల్దార్ సంతోష్ కిరణ్ తదితరులున్నారు.

గురుకుల కళాశాల తనిఖీ..

దేవరకొండ మండలంలోని తెలంగాణ గిరిజన గురుకుల సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాలను బుధవారం కలెక్టర్ హరిచందన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కళాశాలలో రికార్డులు పరిశీలించి విద్యార్థినులతో మాట్లాడారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. పరిశుభ్రమైన వాతావరణంలో వంటలు వండాలని నిర్వాహకులకు సూచించారు. విద్యార్థినులకు వడ్డించే భోజనాన్ని రుచి చూశారు.

ఓటు హక్కు నమోదు చేసుకోవాలి

హాలియా : 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కు నమోదు చేసుకోవాలని కలెక్టర్ హరిచందన సూచించారు. బుధవారం హాలియాలోని ఐటీఐ కళాశాల్లో ఏర్పాటు చేయనున్న పార్లమెంట్ ఎన్నికల డీఆర్సీ (డిస్ట్రిబ్యూషన్ అండ్ రిసెప్షన్) సెంటర్‌ను ఆమె అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) శ్రీనివాస్‌తో కలిసి పరిశీలించారు. డీఆర్సీ సెంటర్‌లో మౌలిక సదుపాయాలు, సీసీ కెమెరాల పనితీరు, ఎలక్ట్రిసిటీ, స్ట్రాంగ్ రూం భద్రత ఏర్పాట్లను తెలుసుకున్నారు. మండలంలోని పులిమామిడి స్టేజీ వద్ద ఏర్పాటు చేసిన పోలీస్ చెక్‌పోస్టును పరిశీలించారు. కలెక్టర్ వెంట మండల తహసీల్దార్ జయశ్రీ, అధికారులు తదితరులు ఉన్నారు.

రైతుల బాగుపై మంత్రులకు సోయి లేదు



యాద్గార్‌పల్లిలో ఎండిపోయిన పంట పొలాలను పరిశీలిస్తున్న మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి, నాయకులు

- రెండు తడులు ఇస్తే రెండు లక్షల ఎకరాల పంట చేతికొచ్చేది
- ఎండిన వరి చేలను పరిశీలించిన మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి

మిర్యాలగూడ : ఉమ్మడి నల్లగొండ జిల్లాలో రైతుల బాగుపై జిల్లా మంత్రులకు సోయి లేకుండాపోయిందని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి విమర్శించారు. బుధవారం మిర్యాలగూడ మండలం యాద్గార్‌పల్లిలో ఎండిన వరి పొలాలను ఆయన ఎమ్మెల్సీ ఎంసీ.కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు నల్లమోతు భాస్కర్‌రావు, కంచర్ల భూపాల్‌రెడ్డితో కలిసి ఆయన పరిశీలించి మాట్లాడారు. ఉమ్మడి జిల్లాలో సాగునీరు లేక పంటలు నిలువునా ఎండిపోతున్నా జిల్లా మంత్రులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్ హయాంలో రెండు పర్యాయాలు తాగునీటి పేరుతో పంట పొలాలకు సాగునీరు అందించి లక్షలాది ఎకరాలను కాపాడామని గుర్తుచేశారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో ఎస్‌ఎల్‌బీసీ, ఎడమ కాల్వ చివరి భూములకు కూడా నీరందించామని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో కాల్వ మొదటి పొలానికి సైతం నీరందని దుస్థితి ఏర్పడిందన్నారు. తాగునీటి పేరుతో ఇటీవల ఖమ్మం జిల్లాకు 12 రోజుల పాటు ఉమ్మడి జిల్లా పరిధిలోని మేజర్ల తూముల వద్ద పోలీసు బందోబస్తు పెట్టి నీటిని తరలించుకుపోయినా జిల్లా మంత్రులు పట్టించుకోలేదన్నారు. ఆ సమయంలో జిల్లాలో ఉన్న చెరువులు, కుంటలు నింపితే రైతులకు ఎంతో మేలు జరిగేదన్నారు. పంటలు పండితే మద్దతు ధర మీద రూ.500 బోనస్ ఇవ్వాల్సి వస్తుందనే సాకుతో నీరు ఇవ్వకుండా నిర్లక్ష్యం చేశారన్నారు. ఇక్కడి మంత్రులకు వసూలు చేయడం ఢిల్లీకి పంపడం మాత్రమే తెలుసని ఎద్దేవా చేశారు. ప్రభుత్వం మిల్లర్లతో కుమ్మక్కై రైతులకు ద్రోహం చేస్తోందని మండిపడ్డారు. రైతులను ఆదుకునేందుకు వెంటనే నష్ట పరిహారం ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తిప్పన విజయసింహారెడ్డి, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు కంచర్ల కృష్ణారెడ్డి, రైతుబంధు సమితి జిల్లా మాజీ అధ్యక్షుడు చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు మోసిన్‌అలీ, నాయకులు నామిరెడ్డి యాదగిరిరెడ్డి, కరుణాకర్‌రావు, సైదులుయాదవ్, హాతీరాం నాయక్, సైదులు, రాములుగౌడ్, మల్లేష్‌గౌడ్, రమణ, సుధాకర్‌రెడ్డి, షోయబ్ పాల్గొన్నారు.

తిరుమలగిరిలో నెగ్గిన అవిశ్వాసం

తిరుమలగిరి (తుంగతుర్తి) : తిరుమలగిరి మున్సిపల్ చైర్‌పర్సన్ పోతరాజు రజనిరాజశేఖర్, వైస్ చైర్మన్ సంకెపల్లి రఘునందన్‌రెడ్డిపై కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు పెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది. బుధవారం ఉదయం 11 గంటలకు ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో సూర్యాపేట ఆర్డీఓ వేణుమాధవరావు సమక్షంలో ఓటింగ్ నిర్వహించారు. మున్సిపల్ కౌన్సిల్‌లో 15 మంది కౌన్సిలర్లు ఉండగా 12 మంది కౌన్సిలర్లు, ఒక ఎక్స్ అఫీషియో సభ్యుడైన తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ హాజరయ్యారు. మొత్తం 13 మంది సభ్యులు చేతులెత్తి అవిశ్వాసానికి మద్దతు తెలిపారు. దీంతో అవిశ్వాసం నెగ్గినట్లు ఆర్డీఓ ప్రకటించారు. అవిశ్వాసం సందర్భంగా 144 సెక్షన్ అమలులో ఉండటంతో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఇద్దరు సీఐలు, నలుగురు ఎస్‌ఐలతో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

హాజరుకాని చైర్మన్, వైస్ చైర్మన్

మున్సిపాలిటీలో ప్రవేశ పెట్టిన అవిశ్వాస తీర్మానానికి చైర్‌పర్సన్ పోతరాజు రజనిరాజశేఖర్, వైస్ చైర్మన్ సంకెపల్లి రఘునందన్‌రెడ్డి, 12వ వార్డు కౌన్సిలర్ సంకెపల్లి జ్యోతి హాజరు కాలేదు. అవిశ్వాసం నివేదికను జిల్లా కలెక్టర్‌కు అందజేయనున్నట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీఓ వేణుమాధవరావు తెలిపారు. ఎన్నికల కమిషన్ నిర్ణయం మేరకు చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక ఉంటుందని, త్వరలోనే తేదీలను ప్రకటించినట్లు తెలిపారు.

కేఎన్‌ఎం కళాశాల అభివృద్ధికి నిధులు

మిర్యాలగూడ అర్బన్ : మిర్యాలగూడ పట్టణంలోని కేఎన్‌ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభివృద్ధికి పీఎం ఉష పథకం కింద రూ.5 కోట్లు మంజూరైనట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ భిక్షమయ్య తెలిపారు. బుధవారం ఆయన కళాశాల వద్ద విలేకరులతో మాట్లాడుతూ ఈ నిధులతో నూతన భవనం నిర్మాణం, లైబ్రరీ, సెమినార్ హాల్, ప్రిన్సిపాల్ చాంబర్, గేమ్స్ అండ్ స్పోర్ట్స్, ఎన్‌సీసీ, ఎన్‌ఎస్‌ఎస్ గదులు, మెయిన్ రోడ్డు నుంచి కళాశాల లోపలి వరకు రోడ్డు, వాష్‌రూమ్‌లతో పాటు ప్రస్తుతం ఉన్న బిల్డింగ్‌కు మరమ్మతులు తదితర పనులు చేస్తామన్నారు. నిధుల విడుదలకు సహకరించిన కమిషనర్ ఆఫ్, కాలేజియేట్ ఎడ్యుకేషన్, ప్రిన్సిపాల్ సెక్రటరీ బి.వెంకటేశం, పీఎం ఉష ప్రాజెక్టు ఆఫీసర్ సౌందర్య జోసెఫ్, జాయింట్ డైరెక్టర్ ప్రొఫెసర్ డాక్టర్ డీఎస్‌ఆర్.రాజేందర్‌సింగ్, రీజినల్ జాయింట్ డైరెక్టర్ జి.యాదగిరి, అకాడమిక్ గైడెన్స్ ఆఫీసర్ బాలభాస్కర్‌కు ఆయన ధన్యవాదాలు తెలిపారు. సమావేశంలో నోడల్ ఆఫీసర్ ఈ.రాంరెడ్డి, అధ్యాపకులు తదితరులు ఉన్నారు.

● యాదాద్రిలో గవర్నర్



రాష్ట్ర నూతన గవర్నర్ రాధాకృష్ణన్ బుధవారం యాదాద్రి లక్ష్మీ నరసింహ స్వామివారికి దర్శించుకున్నారు. గర్భాలయంలో స్వామి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.





నేత్రపర్వం.. శ్రీచక్రతీర్థం

యాదాద్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం స్వామి, అమ్మవార్ల సేవ, ఆళ్వారుడిని చక్రతీర్థ స్నానం కోసం ఊరేగింపుగా తీసుకెళ్తున్న అర్చకులు, ఆలయ సిబ్బంది

విష్ణు పుష్కరిణిలో ఆళ్వారుడికి చక్రతీర్థ స్నానం వేడుక నిర్వహిస్తున్న అర్చకులు

క్లుప్తంగా

గుర్తుతెలియని మహిళ ఆత్మహత్య


మహిళ మృతదేహం

బీబీనగర్: రైలు కింద పడి గుర్తుతెలియని మహిళ ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన బీబీనగర్ మండల కేంద్రంలో గల రైల్వే స్టేషన్ సమీపంలోని ఎగువ లైన్‌లో బుధవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. రైల్వేహెడ్ కానిస్టేబుల్ సత్యనారాయణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సుమారు 40సంవత్సరాలు కలిగి ఉన్న మహిళ బీబీనగర్‌లోని రైల్వే స్టేషన్ సమీపంలో ఎదురుగా వస్తున్న గుర్తుతెలియని రైలు కిందపడడంతో అక్కడికక్కడే మృతిచెందింది. స్థానికులు గుర్తించి సమాచారం ఇవ్వడంతో రైల్వే పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతురాలు ఒంటిపై తెలుపు రంగు చీర, పసుపు పచ్చ జాకెట్ ధరించి ఉందని తెలిపారు. మృతదేహాన్ని భువనగిరి ఆస్పత్రిలోని మార్చురీలో భద్రపరిచినట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

అదుపుతప్పి లారీ బోల్తా

నాగార్జునసాగర్: తెలంగాణ నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు మార్కెట్‌కు మిరపకాయల లోడుతో వెళుతున్న లారీ అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటన నాగార్జునసాగర్‌లో గల హిల్‌కాలనీకి సమీపంలోని ముత్యాలమ్మగుడి మూలమల్పు వద్ద బుధవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. ప్రమాదంలో డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు అతడిని కమలా నెహ్రూ ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు. వాహనం రోడ్డు పక్కకు పడిపోవడంతో ప్రమాదం తప్పిందని పోలీసులు తెలిపారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

గుర్రంపోడు : విద్యుదాఘాతంతో ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన గుర్రంపోడు ఆమలూరు గ్రామంలో జరిగింది. ఎస్ఐ శివప్రసాద్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆమలూరు గ్రామానికి చెందిన వంగూరి నర్సింహ(52) బుధవారం ఇంటి ఆవరణలోని సంపు మోటారు నీరు పోయకపోవడంతో మరమ్మతులు చేస్తున్నాడు. ఈ క్రమంలో విద్యుదాఘాతానికి గురయ్యాడు.గమనించిన కుటుంబ సభ్యులు అతడిని ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మరణించాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఎమ్మార్పీ కంటే అధికంగా తీసుకోవద్దు

సూర్యాపేట రూరల్ : నిత్యావసర వస్తువులపై ఎమ్మార్పీ కంటే అధికంగా డబ్బులు తీసుకుంటే చర్యలు తప్పవని జిల్లా తునికల కొలతల ఇన్‌స్పెక్టర్ ఎస్.సంజయ్‌కృష్ణ హెచ్చరించారు. సూర్యాపేట మున్సిపాలిటీ పరిధిలోని రాయినిగూడెం సమీపంలో ఉన్న సాయికృష్ణ రెస్టారెంట్‌లో కూల్‌డ్రింక్స్ స్టాల్స్‌ను బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖీలో వాటర్ బాటిల్స్‌పై రూ. 5, బిస్కెట్స్, హల్దీరామ్ ప్యాకెట్స్‌పై ఎమ్మార్పీ కంటే అధికంగా తీసుకుంటున్నారని తెలపడంతో కూల్‌డ్రింక్స్ షాపుపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఎవరైనా ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు విక్రయిస్తే ఫిర్యాదు చేయాలని సూచించారు.

శ్రీ చక్రతీర్థం.. పుష్పయాగం

- బ్రహ్మోత్సవాల్లో నారసింహుడికి విశేష పూజలు
- ప్రథమ ప్రాకార మండపంలో మహా పూర్ణాహుతి
- రాత్రి వైభవంగా స్వామివారి దోపోత్సవం
- నేడు శతఘటాభిషేకంతో ముగియనున్న ఉత్సవాలు


మహా పూర్ణాహుతి నిర్వహిస్తున్న ఆచార్యులు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా బుధవారం ఉదయం ఆలయంలో నిత్యారాధనలు, శ్రీవిష్ణు సహస్ర నామ పారాయణాలు నిర్వహించారు. 10.30 గంటలకు ఆలయ ఆచార్యులు, యాజ్ఞీకులు మహా పూర్ణాహుతి కార్యక్రమాన్ని చేపట్టారు. 10రోజుల పాటు ఉదయం, సాయంత్రం జరిగిన హోమాధి పూజలు, నిత్య పూర్ణాహుతిని ఆచార్యులు శాస్త్రోక్తంగా జరిపించారు. స్వామివారి బ్రహ్మోత్సవాల పరిసమాప్తి సూచకంగా మహా పూర్ణాహుతి వేడుక జరిపించారు. వేడుకలో ఆలయ భాస్కర్‌రావు, అనువంశిక ధర్మకర్త నర్సింహమూర్తి, ప్రధానార్చకులు, యాజ్ఞీకులు, రుత్వికులు, ఆచార్యులు, అధికారులు, పాల్గొన్నారు.

శ్రీచక్ర ఆళ్వారుడితో..

మహావిష్ణువు ఆయుధమైన శ్రీచక్ర ఆళ్వారుడికి మధ్యాహ్నం 1గంటలకు విశేష పూజలు చేశారు. కొండపైన గల విష్ణు పుష్కరిణిలో శ్రీచక్రతీర్థ స్నానం చేయించారు. తొలుత ఆలయ ప్రథమ ప్రాకార మండపంలో ఉత్సవమూర్తులను, శ్రీచక్ర ఆళ్వారునికి అలంకరించి పల్లకిపై అధిష్ఠింపజేసి పూజలు చేశారు. సుదర్శ నారసింహ అలంకారంతో ఆలయ మాఢ వీధుల్లో ఊరేగిస్తూ విష్ణు పుష్కరిణి వద్దకు సేవను తీసుకువచ్చారు. అనంతరం పుష్కరిణి మండపంలో ఆచార్యులు శ్రీచక్ర ఆళ్వారుడికి పూజలు నిర్వహించారు. వివిధ పుష్పాలు, కుంకుమ, పసుపు, సుగంధ్ర ద్రవ్యాలను పుష్కరిణి నీటిలో కలిపి శాస్త్రోక్తంగా పూజలు చేశారు.శ్రీచక్ర ఆళ్వారుడికి శుద్ధమైన జలంలో స్నానం చేయించారు.


విష్ణు పుష్కరిణిలో స్నానం ఆచరిస్తున్న భక్తులు


స్వామి, అమ్మవారికి పుష్పయాగ పూజలు నిర్వహిస్తున్న ఆచార్యులు

సకల దేవతలకు ఉద్వాసన

నిత్యారాధనల అనంతరం సాయంత్రం దేవతల ఉద్వాసన, శ్రీపుష్పయాగం, దోపోత్సవం ఘనంగా నిర్వహించారు. మహోత్సవంలో తెలిసి, తెలియక జరిగిన సర్వ విధ దోషములను తొలగించుటకు ప్రాయశ్చిత్తంగా ఆచార్యులు ఈ పుష్పయాగం నిర్వహించారు. ఇక బ్రహ్మోత్సవాల్లో ఆయా మంత్రములతో ఆహ్వానించిన సర్వ దేవతలను మంత్రపూర్వకంగా ఉద్వాసన పలికారు. అనంతరం స్వామి వారికి ప్రీతికరమైన దోపోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు.

ఆలయంలో నేడు

బ్రహ్మోత్సవాల్లో భాగంగా చివరి రోజు గురువారం ఉదయం 10గంటలకు స్వామి వారి అష్టోత్తర శత ఘటాభిషేకం జరిపిస్తారు. రాత్రి 9గంటలకు స్వామి వారి శృంగార డోలోత్సవం నిర్వహించి ఉత్సవాలకు పరిసమాప్తి పలుకుతారు.



దేవతోద్వాసన పూజలు నిర్వహిస్తున్న ఆచార్యులు, స్వామి అమ్మవార్ల సేవ, శ్రీచక్ర ఆళ్వారుడిని విష్ణు పుష్కరిణి వద్దకు తీసుకెళ్తున్న అధికారులు, అర్చకులు

శ్రీపుష్పయాగంలో సీఎస్ శాంతికుమారి


పుష్పయాగ పూజ నిర్వహిస్తున్న సీఎస్ శాంతికుమారి

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి నిర్వహించిన శ్రీపుష్పయాగం, దేవతోద్వాసన, దోపు వేడుకల్లో ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ శాంతికుమారి పాల్గొన్నారు. ముఖ మండపంలో నిర్వహించిన ఈ వేడుకల్లో సీఎస్ పాల్గొని ప్రత్యేక పూజలు జరిపించారు. అంతకుముందు ఆలయ ముఖ మండపాల్లో ఏర్పాటు చేసిన శ్రీస్వామి వారి అవతారలకు సంబంధించిన ఫొటో ఎగ్జిబిషన్‌ను సందర్శించారు. చీఫ్ సెక్రటరీ శాంతి కుమారికి ఆలయ అధికారులు సంప్రదాయంగా స్వాగతం పలికారు. అనంతరం శివాలయంలో ఆమె ప్రత్యేక పూజలు నిర్వహించారు. సీఎస్ శాంతి కుమారికి కలెక్టర్ హనుమంత్ కే జెండగే, రాచకొండ సీపీ తరుణ్ జోషి, ఈవో భాస్కర్‌రావు, అనువంశిక ధర్మకర్త బి.నర్సింహమూర్తి స్వాగతం పలికారు.

దేశ ఆర్థిక పరిపుష్టిలో చేనేత రంగం కీలకం

- మేజర్ జర్నల్ అజయ్‌కుమార్ సింగ్, ఐఏఎస్ మధురాణి టియోటియా కితాబు
- పోచంపల్లిని సందర్శించిన నేషనల్ డిఫెన్స్ అకాడమీతో పాటు పలు దేశాల అధికారుల బృందం


రీలింగ్ యూనిట్‌ను పరిశీలిస్తున్న అధికారులు

భూదాన్‌పోచంపల్లి : దేశ ఆర్థిక పరిపుష్టిలో చేనేత రంగం కీలకమని న్యూఢిల్లీ నేషనల్ డిఫెన్స్ అకాడమీ మేజర్ జర్నల్ అజయ్‌కుమార్ సింగ్, ఐఏఎస్ అధికారిణి మధురాణి టియోటియా అన్నారు. బుధవారం నేషనల్ డిఫెన్స్ అకాడమీతో పాటు ఇంగ్లండ్, బ్రెజిల్, టాంజానియా, నేపాల్, మయన్మార్ దేశాలకు చెందిన 16మంది ఉన్నతాధికారుల బృందం పోచంపల్లిని సందర్శించారు. చేనేత సహకార సంఘం, కళాపునర్వి హ్యాండ్లూమ్ యూనిట్‌ను పరిశీలించారు. ఇక్కత్ వస్త్రాల డిజైన్‌లను పరిశీలించి చేనేత కళాకారుల నైపుణ్యాలను అభినందించారు. ఈ సందర్భంగా అజయ్‌కుమార్ సింగ్ విలేకరులతో మాట్లాడుతూ దేశ ఆర్థిక వ్యవస్థలో అంతర్జాతీయంగా పేర్గాంచిన పోచంపల్లి చేనేత ఇక్కత్ పరిశ్రమ ప్రధాన భూమిక పోషిస్తుందని కొనియాడారు. పరిశ్రమలు, ఫార్మా, ఎయిరో స్పేస్, ఇంజనీరింగ్ రంగాలు కూడా బలమైన ఆర్థిక రంగానికి పునాదులు వేశాయని అన్నారు. పోచంపల్లిలో విద్యావంతులైన యువకులు సాయిని భరత్, భాస్కర్ సాంప్రదాయ చేనేత వృత్తికి ఆధునిక సాంకేతికను జోడిస్తూ ఈ వృత్తిని మరో తరానికి అందిస్తున్న తీరును అభినందించారు. వివిధ రంగాల అధ్యయనం అనంతరం ఈ నెల 22న సీఎం రేవంత్‌రెడ్డి, సీఎస్, ఉన్నతాధికారులతో సమావేశమై తమ దృష్టికి వచ్చిన పలు అంశాలపై ఫీడ్‌బ్యాక్ ఇవ్వనున్నట్లు తెలిపారు.

పథకాల రూపకల్పనలో భాగస్వామ్యం

మేజర్ జర్నల్ ఏకే సింగ్ ఆధ్వర్యంలో ఎన్‌డీఏ అధికారుల బృందం దేశ ఆర్థిక వ్యవస్థలో ప్రధాన పాత్ర పోషిస్తున్న పలు రంగాలను అధ్యయనం చేస్తున్నారని ప్రాజెక్ట్ నోడల్ ఆఫీసర్ వెంకట శేఖర్ చెప్పారు. తెలంగాణలో హ్యాండ్లూమ్, ఫార్మా, ఇంజనీరింగ్, టీ-హబ్, టాటా ఎయిరో స్పేస్ ను సందర్శించనున్నారని చెప్పారు. వీరి వెంట జిల్లా చేనేత, జౌళిశాఖ ఏడీ విద్యాసాగర్, జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ రాజేశ్వర్‌రెడ్డి, తహసిల్దార్ శ్రీకాంత్‌రెడ్డి, ఆర్ఐ వెంకట్‌రెడ్డి, డీఓ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఇరువర్గాల ఘర్షణలో ఒకరికి తీవ్ర గాయాలు

- పోలీస్‌స్టేషన్ ఎదుట యువకుల హల్‌చల్
- పోలీసుల లాఠీచార్జ్


మిర్యాలగూడ పోలీస్ స్టేషన్ ఎదుట హల్‌చల్ సృష్టించిన ఇరువర్గాల యువకులపై లాఠీచార్జ్ చేస్తున్న పోలీసులు

మిర్యాలగూడ అర్బన్: ఇరువర్గాల ఘర్షణలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. మిర్యాలగూడ పట్టణంలో చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. మిర్యాలగూడ పట్టణంలోని సాగర్ రోడ్డులో గల ఓ షాపింగ్ మాల్‌లో పని చేసే యువతి ప్రతి రోజు ఆటోలో వచ్చి వెళుతుండేది. ఈ క్రమంలో మంగళవారం రాత్రి రోజు మాదిరిగానే ఆటోలో వెళ్లేందుకు ఉపక్రమించగా మరో డ్రైవర్ అఫ్రోజ్‌ఆ యువతిని చూసి నవ్వడంతో పాటు సైగ చేవాడు. దీంతో సదరు యువతి అతడిని దగ్గరకు పిలిచి ఎందుకు అలా ప్రవర్తిస్తున్నావని అడగ్గా బరాబర్ అలానే చూస్తా అంటూ ఆమె చేయి పట్టుకున్నాడు. దీంతో అక్కడే ఉన్న ఆమెను ప్రతి రోజు తీసుకెళ్లే ఆటో డ్రైవర్ అఫ్రోజ్‌ను వెనుకకు నెట్టి వేశాడు. ఆ విషయాన్ని మనుసులో పెట్టుకున్న అఫ్రోజ్ 30మందికి పైగా యువకులను వెంట బెట్టుకుని సదరు యువతి బుధవారం రాత్రి ఆటో ఎక్కే సమయంలో అక్కడికి వచ్చాడు. విచక్షణ రహితంగా సదరు ఆటో డ్రైవర్‌ను కొడుతుండగా తన స్నేహితులకు ఫోన్‌ద్వారా సమాచారం అందించడంతో కొంతమంది అక్కడికి వచ్చారు. దీంతో ఆ ఇరువర్గాల వారు గొడవకు దిగడంతో హరి అనే యువకుడి తలకు తీవ్ర గాయమైంది. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ఇరువర్గాల వారిని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. రెండు వర్గాల యువకులు పోలీస్ స్టేషన ఎదుట హల్‌చల్ చేయడంతో తిరిగి గొడవ జరుగుతదని గ్రహించిన పోలీసులు లాఠీచార్జ్ చేసి చెదరకొట్టారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఎన్నికల్లో సామాజిక న్యాయం పాటించాలి

- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్


సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్‌గౌడ్

సంస్థాన్ నారాయణపురం : పార్లమెంట్ ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు సామాజిక న్యాయం పాటించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. సంస్థాన్ నారాయణపురంలో బుధవారం జరిగిన ఆ సంఘం సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు బీసీలకు సగం ఎంపీ స్థానాలను కేటాయించాలని కోరారు. సామాజిక న్యాయం, రాజకీయ సమానత్వం పాటిస్తామని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ బీసీలకు అధిక లోక్‌సభ స్థానాలు కేటాయించి చిత్తశుద్ధిని నిరూపించుకోవాలన్నారు. భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గంలో 60శాతానికి పైగా ఉన్న బీసీలకు అవకాశం కల్పించాలని కాంగ్రెస్ అధిష్ఠానాన్ని కోరారు. బీసీలను రాజకీయంగా అణచివేయాలని చూస్తే ఊరుకోమని హెచ్చరించారు. సమావేశంలో సర్పంచుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుర్వి యాదయ్యగౌడ్, నాయకులు వీరమల్ల కార్తీక్, గణం నరసింహ, వరికుప్పల మధు, లక్ష్మణ్, నరసింహ, నవీన్, సత్తమ్మ, శ్రీకాంత్, భరత్, శోభన్ తదితరులున్నారు.

తేనెటీగల పెంపకంతో స్వయం ఉపాధి

గరిడేపల్లి : తేనెటీగల పెంపకంతో స్వయం ఉపాధి పొందవచ్చని ఎస్‌బీఐ మేనేజర్ సుకుమార్ తెలిపారు. వ్యవసాయ విస్తరణ యాజమాన్య సంస్థ సమేతి, వ్యవసాయ శాఖ ఆర్థిక సహాయంతో గడ్డిపల్లిలోని కృషి విజ్ఞాన కేంద్రంలో శాస్త్రీయ పద్ధతిలో తేనెటీగల పెంపకం, సేంద్రియ వ్యవసాయంపై ఏడు రోజుల వృత్తి నైపుణ్య శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. తేనెటీగల పెంపకంతో ఆదాయంతో పాటు ఆరోగ్యం కూడా లభిస్తుందన్నారు. బ్యాంక్ పరంగా సబ్సిడీలు, లోన్స్ రైతులు, యువతకు ఉపయోగించుకోవాలని సూచించారు. ఉద్యాన శాస్త్రవేత్త సీహెచ్ నరేష్, మృత్తిక శాస్త్రవేత్త కిరణ్‌లు మాట్లాడుతూ ఏడు రోజుల శిక్షణ కార్యక్రమం ఉద్దేశం తేనెటీగల పెంపకం, సేంద్రియ వ్యవసాయంలో లాభాలు, కేవీకేలో జరిగే వివిధ శిక్షణ కార్యక్రమాల, ఉత్పత్తుల గురించి వివరించారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు డి ఆదర్శ్, మాధురి, రైతులు తదితరులు పాల్గొన్నారు.


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్‌బీఐ మేనేజర్ సుకుమార్

రోడ్డు ప్రమాదంలో ధరణి ఆపరేటర్ మృతి

కేతేపల్లి: రోడ్డు ప్రమాదంలో ధరణి ఆపరేటర్ మృతిచెందాడు. కేతేపల్లి మండలంలోని ఇనుపాముల శివారులో బుధవారం చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. నకిరేకల్ పట్టణానికి చెందిన రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ రైటర్ సింగరి రాములు కుమారుడు నరేష్(32) కేతేపల్లి తహసీల్దారు కార్యాలయంలో ధరణి కంప్యూటర్ ఆపరేటర్‌గా పని చేస్తున్నాడు. బుధవారం కేతేపల్లిలో విధులకు హాజరైన నరేష్ తిరిగి సాయంత్రం బైక్‌పై నకిరేకల్‌కు బయలుదేరాడు. మార్గమధ్యలో ఇనుపాముల శివారులో ఉన్న బైపాస్ జంక్షన్ దాటిన తర్వాత ముందు వెళ్తున్న ఆర్టీసీ బస్సును ఓవర్‌టేక్ చేసే క్రమంలో బైక్ అదుపుతప్పి పల్టీ కొట్టింది. ఈప్రమాదంలో బైక్‌పై నుంచి కిందపడిన నరేష్‌పై నుంచి బస్సు వెనుక టైర్లు వెళ్లడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని నకిరేకల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి తండ్రి రాములు చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ శివతేజ తెలిపారు.

భారీగా పేలుడు పదార్థాలు స్వాధీనం

నాగార్జునసాగర్: ఆంధ్రా, తెలంగాణ సరిహద్దులోని హిల్‌కాలనీ కొత్తవంతెన చెక్‌పోస్టు వద్ద పోలీసులు భారీగా పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖరరాజు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. హైదరాబాద్ నుంచి నార్సింగ్ వైపు బుధవారం తెల్లవారుజామున వెళ్తున్న ఓ వ్యాన్‌ను చెక్‌పోస్టు పోలీసులు తనిఖీ చేశారు. అందులో ఎటువంటి ఆధారాలు లేని 1,450కిలోల జిలెటిన్ స్టిక్స్, 3000మీటర్ల పొడవు గల సేఫ్టీ ఫీజు వైర్లు ఉన్నాయి. వాటిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వ్యాన్‌తో పాటు డ్రైవర్ నాగేంద్రబాబును అదుపులోకి తీసుకుని విజయపురి టౌన్ పోలీస్టేషన్‌కు తరలించారు.పేలుడు పదార్థాల తరలింపు చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లుగా తెలిపారు. కార్యక్రమంలో సీఐ బీసన్నతో పాటు ఎస్ఐ సంపత్‌గౌడ్,హెచ్‌సీ వెంకటేశ్వర్లు,హెచ్‌జీ దౌలా తదితరులు ఉన్నారు.

అదుపుతప్పి ఇంట్లోకి దూసుకెళ్లిన కారు

మర్రిగూడ : మర్రిగూడ మండల కేంద్రానికి చెందిన లపంగి యశ్వంత్ బుధవారం కారులో నాంపల్లికి బయలుదేరాడు. మండలంలోని వట్టిపల్లి పరిధిలోని బట్లపల్లి గ్రామం వద్దకు చేరుకోగానే కారు అదుపుతప్పి రోడ్డు వెంట ఉన్న ఇంట్లోకి దూసుకెళ్లింది. ప్రమాదంలో యశ్వంత్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ఘటనలో రెండు ద్విచక్ర వాహనాలు ధ్వంసమవగా ఇంటి పైకప్పు రేకులు దెబ్బతిన్నాయి.


ఇంటి పైన రేకుల మీద వేలాడుతున్న కారు

ఉరేసుకుని సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్య

మిర్యాలగూడ అర్బన్: ఉరేసుకుని ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్య చేసుకున్నాడు. మిర్యాలగూడ పట్టణంలో చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. మిర్యాలగూడలోని శాంతినగర్‌కు చెందిన శ్రీనివాసరావు(43) సాఫ్ట్‌వేర్ ఉద్యోగంలో భాగంగా వర్క్ ఫ్రం హోం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. రెండేళ్లుగా భార్య భర్తల మధ్య గొడవలు జరుగుతుండగా పోలీస్ స్టేషన్‌లో కేసులు సైతం పెట్టుకున్నారు. అప్పటి నుంచి కోర్టులో కేసు నడుస్తుందని తెలిసింది. ఈ క్రమంలో షేర్ మార్కెట్‌లో నష్టం రావడంతో అప్పులు ఎక్కువ అవగా.. శ్రీనివాసరావు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నాడు. ఒక వైపు ఆర్థిక ఇబ్బందులు, మరో వైపు కుటుంబ కలహాలు కోర్టు కేసులతో మనస్తాపం చెందిన ఆయన ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. మృతుడికి ఇద్దరు సంతానం ఉన్నారు. మృతుడి తండ్రి హనుమంతరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కృష్ణయ్య తెలిపారు.